# ఒకనాటి రూపం



"బావున్నారా?"

నిజంగా ఆశ్చర్యమే. ఆమె ఎవరో నాకు తెలుసు. ఒక వర్ధమాన నటి. ఇప్పుడిప్పుడే ఆమె వెలుగులోకి వస్తోంది. ఈమధ్య ఆమె నటించిన చిత్రాలు రెండు శతదినోత్సవం జరుపుకున్నాయి.

ఆమె పేరు మంజరి.

"మాట్లాడరేం మాస్టారూ" నవ్వుతూ అన్నదామె.

మళ్ళీ షాక్. నేను ఆమెకు తెలుసా? లేక నన్ను చూసి మరెవరో అనుకోవడం లేదు

కదా. మెల్లగా పెదవులు కదిలించాను.

"మీ రెవరో నాకు తెలుసు. ఒక నటిగా. కాని నేను మీకు తెలుస్తున్నట్టుగా నేను అనుకోవడం లేదు" అన్నాను.

మంజరి నవ్వింది ఆమె పలువరుస తళుక్కుమంది.

"భలేవారే మాస్టారూ! నన్నే గుర్తుపట్టలేదా- మీ నాగరత్నంని" అన్నది చిన్నగా. ఆ కంపార్టుమెంటులో మరెవ్వరూ ఆమె అసలు పేరు వినకూడదనే అలా చిన్నగా చెప్పింది.

నాగర్నతం పేరు వినగానే ఉలిక్కిపడ్డాను. నిశితంగా మంజరి ముఖంలోకి చూశాను. నాగరత్నం పోలికల కోసం గబగబా వెతికాను. దొరికాయి.

"నాకు చాలా ఆశ్చర్యంగా, ఆనందంగా ఉంది" అన్నాను.

"థాంక్స్" అన్నది మంజరి- ఒకనాటి నాగరత్నం.

నా ఎదురుగా కూర్చున్న సినీ నటి ఒకప్పుడు నా పంచన పెరిగిన నాగర్నతం అని తెలిసినప్పుడు ఆమెరూపం కనుల ముందు గుప్పుమన్నది.

ఆలోచనలు వెనక్కి పరుగు తీశాయి.

కాని,"ఇప్పుడు మీరెక్కడ ఉంటున్నారు మాస్టారూ" అని మంజరి అడగటంతో ఆలోచించలేక పోయాను.

"విజయవాడలోనే" చెప్పాను.

"అప్పటినుంచీ మీరు బెజవాడను వదల్లేదా?"

"వదిలాను. ఈ మధ్యనే మళ్ళీ వచ్చాను"

"ఎక్కడా ఉండటం? అదే కదా?"

"కాదు. ఇప్పుడు సూర్యారావుపేటలో. వాణి నికేతన్ ఎదురు రోడ్డులో మేడ మీద."

"ఆ రోడ్డును నేను మరిచిపోలేదు. ఆ మాటకొస్తే ఆ రోడ్డునే కాదు. బెజవాడంతా ఇప్పటికీ నాకు కొట్టిన పిండే"

"ఎన్నాళ్ళయింది నువ్వు ఈ ఫీల్డులో ప్రవేశించి?" అడిగాను.

"ఆరేళ్ళయింది. చాలా సినిమాల్లో నాలుగేళ్ళ క్రితం వరకూ ఎక్స్‌ట్రా వేషాలు వేశాను. తరవాత లక్ కలిసొచ్చింది. ఒక పిక్చరులో సహాయ నటిగా వేశాను. ఆ కారెక్టర్‌కి మంచి నేమొచ్చింది. తరవాత హీరోయిన్ పాత్రలు లభించాయి. ఇప్పుడు ఇంకో మూడు పిక్చర్లలో బుక్కయ్యాను" నవ్వుతూ చెప్పిపంది.

"రియల్లీ వండర్" నవ్వుతూ అన్నాను.

"యస్. రియల్లీ వండర్. అప్పట్లో మీరు నా భవిష్యత్తు గురించి మాట్లాడుతూ నేనొక

గొప్ప నటినీ, డాన్సర్‌నీ అవుతానని చెప్పేవారు. నేను నమ్మేదాన్ని కాదు. కాని మీ మాటలే నిజమయ్యాయి. అవకాశ మంటూ వచ్చిన తరువాత మీ మాటలు నాకు ఎంతో ప్రోత్సాహమిచ్చాయి. తగిన కృషి చేశాను. కొంచెం కాంతిలోకి వచ్చాను. ఈనాటి నా ఎదుగుదలకు కారణమయిన మీకు బాగానే రుణపడి ఉన్నాను."

నాగరత్నం పూర్తిగా మారిపోయింది. ఆమెలో ఉన్నది ఇదివరకటి మనిషి తాలూకు కొన్ని పోలికలు. ఒక మనిషిలో ఇంతటి మార్పు సాధ్యమా? అనిపించింది ఆమెను చూస్తుంటే. రాడికల్ ఛేంజు. అప్పటి నాగరత్నం నా కళ్ళముందు కదిలింది. ఆమెతోపాటు ఆమె తమ్ముడుకూడా గుర్తుకొచ్చాడు.

"మరిచాను. మీ తమ్ముడు ఎక్కడున్నాడు?" గబుక్కున అడిగాను.

ఆమె మాట్లాడలేదు. మవునంగానే కూర్చుంది. నిమిషం తరవాత ఆమె తలెత్తి నా కేసి చూస్తే ఆమె కళ్ళలో నీళ్ళు కనిపించాయి.

"ఏమయిందతనికి" ముందుకు వంగుతూ అడిగాను.

"ఏడాది క్రితం మద్రాసులోనే యాక్సిడెంటులో పోయాడు" మంజరికి దుఃఖ మొచ్చింది.

"సారీ. గాడ్ ఈజ్ కైండ్‌లెస్" అన్నాను. ఆ వార్త నాకూ బాగానే బాధను కలిగించింది. అప్పట్లో అతను కూడా నాతో బాగా చనువుగా ఉండేవాడు.

"ఇప్పుడు నేను ఒంటరిదాన్ని మాస్టారూ" చిన్నగా అన్నది.

కన్నీళ్ళు ఆమె చేతి రుమాలుకు ఇంకిపోయాయి. ఆ కళ్ళను నాకు చూపలేక నల్లని కళ్ళద్దాలను పెట్టుకున్నది.

నేను మాట్లాడ బోయేంతలో రైలు ఏదో స్టేషన్లో ఆగింది.

వెంటనే విండో షట్టర్స్‌ని గబగబా లాగేసింది మంజరి.

"ఎందుకలా మూస్తున్నావ్?" అడిగాను.

"ఎవరయినా ఇక్కడ నన్ను గుర్తు పడితే రైలు ఇప్పుడిప్పుడే కదలదు. పాసింజర్స్‌కి ఇబ్బంది"

నవ్వొచ్చింది. సినీ నటులందరి అవస్థలే ఇవి.

"ఇంతకు ముందు ఎప్పుడయినా ఇలా అయిందా?"

"అవును. మూడు నెల్ల క్రితం రాజమండ్రి వెళుతున్నప్పుడు ఇలా జరిగింది. రైలు అరగంట లేటయ్యింది. కొంతమంది నా ఎదురుగానే విసుక్కున్నారు. రైల్వే వాళ్ళు అతికష్టంమీద డోర్స్ క్లోజు చేసి నన్ను చూట్టానికి వచ్చినవాళ్ళను తరిమేశారు."

"ఇంతకీ ఇప్పుడు నువ్వు ఎంత వరకు?"

"బెజవాడ"

"ఏదయినా షూటింగ్ ఉందా?"

"లేదు. ఒక అసోసియేషన్ వాళ్ళు సన్మానం చేస్తున్నారు. ఈ రాత్రికి తొమ్మిది గంటలకు" అని హాండ్ బాగ్ తెరిచి అందులోంచి ఒక పాసు తీసి ఇస్తూ, "మీరు తప్పకుండా రండి" అన్నది.

తలూపాను.

మంజరి అభివృద్ధి నాకు బాగానే సంతోషాన్ని కలిగించింది.

ఆ రోజుల్లో నిజంగానే ఆమె భవిష్యత్తు గురించి నాకు కొంత నమ్మకం ఉన్నా ఆమెను ఉత్సాహపరచటానికే నేను ఆమె గొప్ప డాన్సరూ, సినీ నటి అవుతుందనే అనే వాడిని.

అది ఒకనాటి ఆలోచన. అదే ఇప్పటి నిజం.

కొన్నేళ్ళ క్రితం విజయవాడ వీధుల్లో గజ్జె కట్టుకుని సినిమా పాటలు పాడుతూ ఎగిరి పొట్ట పోసుకున్న బజారు పిల్ల నాగరత్నం ఇప్పుడు సినీ నటి – మంజరి.

ఆమె గతం ఎంతమందికి తెలుసు?

ఎక్కడ డాన్సు చేసినా సాయంత్రమయ్యేసరికి నా గది ముందుకు చేరుకునే వాళ్ళు నాగరత్నం, ఆమె తమ్ముడు వెంకూ, అప్పట్లో నాగర్నతం వాడిని అలాగే పిలిచేది. అప్పుడామెకు పధ్నాలుగేళ్ళు. వాడికి పన్నెండు.. నా బాత్‌రూమ్‌లోనే నాగరత్నం స్నానం చేసేది. ఒక మూల రాళ్ళతో పొయ్యి చేసి అన్నం వండేది. నాకేదయినా అవసరమయితే తీసుకు వచ్చేది. రాత్రిపూట బయట గచ్చు మీద అక్కా తమ్ముడూ గుడ్డలు పరుచుకు పడుకునే వాళ్ళు. నేను మంచం మీద పడుకునే వాడిని. నాగరత్నం కబుర్లు మొదలు పెట్టేది. తనకు ఆ రోజు ఎంత డబ్బు వచ్చిందీ, వచ్చిన డబ్బులో ఎంతెంత దేనికి ఖర్చు చేసిందీ చెప్పేది. వింటూ నిద్రపోయే వాడిని.

ఎన్నో సార్లు నాగరత్నం డాన్సును చూశాను. చాలా బాగా చేసేది. అచ్చం సినిమాలో పాటకు నటి చేసినట్టుగానే చేసేది. అందుకే ఆమెకు డబ్బులు బాగానే వచ్చేవి. ఆ వచ్చిన డబ్బులతో వారానికి నాలుగు సినిమాలు చూసేది. ఒక్కో సినిమాను రెండుసార్లు చూసేది. డాన్స్ నేర్చుకోవటానికి. సినిమా బండ్ల దగ్గర నిలబడి కొత్త సినిమాల్లోని పాటలను జాగ్రత్తగా వినేది. పాటలు పూర్తిగా రాగానే కొత్త పాటలను పాడుతూ డాన్స్ చేసేది. వెంకూ కంజీర మోగించే వాడు.

వెంకూను చూస్తే నాకు అతను మామూలు మనిషిగానే కనిపించే వాడు. కానీ నాగరత్నంలో మాత్రం కళ నిగూఢమై ఉన్నదనీ, ఎవరయినా వెలికి తీస్తే బాగా రాణించ

గలదనీ అనిపించేది. ఆ మాటనే ఆమెతో అనే వాడిని. కాని నాగరత్నం నా మాటలను నమ్మేది కాదు.

ఇప్పుడు నమ్మక ఏం చెయ్యగలదు?

"ఏమిటి మాష్టారూ! ఆలోచిస్తున్నారు? - నా గతం గురించా?" అడిగింది మంజరి.

అవునన్నట్టు తలాడించాను.

"నాకూ ఆశ్చర్యంగానూ, ఆనందంగానూ ఉంది. ఎక్కడయితే గజ్జెలు కట్టుకుని పిచ్చిగా రోడ్డు మీద గంతులు వేశానో ఇప్పుడు అక్కడే సన్మానం చేయించుకోబోతున్నాను."

"అందుకే మనం ఫ్యూచర్‌ని చెప్పలేము"

"అవును"

"నువ్వు ఒక్కదానివే వస్తున్నావా?"

"కాదు. ఇంకో ఇద్దరు ఇక్స్‌ట్రాలు వస్తున్నారు. వాళ్ళు సెకండ్ క్లాసులో ఉన్నారు"

"నీ సినిమాలు చూసికూడా నిన్ను పోల్చుకోలేక పోయాను. ఐయామ్ లక్కీ. ఇప్పుడు నిన్ను కలుసుకో గలిగాను. థాంక్స్ టు దిస్ ట్రెయిన్."

"నేను కూడా మీరు ఇంకా ఆ గదిలోనే ఉన్నారనుకుని ఆ ఎడ్రసుకు మూడు ఉత్తరాలు రాశాను. అవి కొన్నాళ్ళ తరవాత నాకే తిరిగి వచ్చాయి. ఆ తరవాత మిమ్మల్ని కలిసే ఉపాయమే దొరకలేదు. నాకు ఎంతో బాధ కలిగింది."

"మీరు విజయవాడ నుంచి మకాం ఎత్తేసి గుంటూరుకు వెళ్ళి పోయిన నెల రోజులలో నాకు బందర్‌కి ట్రాన్స్‌ఫరయింది."

"అలాగా" గాలికి రేగుతున్న ముంగురులు సున్నితంగా వేళ్ళతో సరిచేసుకుంది మంజరి.

ఆమెలో క్రియేటివ్ బ్యూటిన్ కొట్టొచ్చినట్టు కనిపిస్తూంది. పెదిమలకు ఎర్రని రంగు.

కూల్ డ్రింక్స్ వచ్చాయి. రెండు లిమ్కా తీసుకున్నాను. తను సిప్ చేస్తూ "ఇంతకుముందు మీకు ఇలాంటి డ్రింక్స్ తాగితే వంటికి పడేది కాదని చెప్పేవారు. ఇప్పుడు బాగానే ఉంటోందా?" అడిగింది.

నవ్వాను.

"ఇప్పుడూ అంతే. అయినా నిలవలేక"

"భలేవారే"

ఆ తరవాత ఎన్నో కబుర్లు ఇద్దరి మధ్యనా.

విజయవాడ వచ్చింది.

మంజరి నా రూము అడ్రసు తీసుకుంది.

"సన్మానం అయిపోగానే మీ రూముకు వస్తాను. కొంచెం సేపు మీతో హాయిగా మాట్లాడాలి. మీరు మాత్రం ఫంక్షనుకు తప్పకుండా రండి" అన్నది. తలూపాను.

అప్పటికే పూలదండలతో ఆ అసోసియేషన్ వాళ్ళు ఆమెకోసం సిద్దంగా ఉన్నారు. మంజరి దిగివచ్చిన వెంటనే దండలన్నింటినీ ఆమె మెడలో వేశారు. ఒక కెమెరా తళుక్కుమన్నది.

నవ్వుకుంటూ ముందుకు నడిచాను.

+++

సన్మానం ముగిసేసరికి పదిన్నరయింది. రిక్షాలో గది కొచ్చాను.

బాగా జరిగింది సన్మానం. మంజరి నటనను ప్రశంసిస్తూ చాలామంది మాట్లాడారు. ఆమెకు మంచి భవిష్యత్తు ఉందనీ అన్నారు. తరవాత మంజరి కూడా తనకు అలాంటి సన్మానం జరిగినందుకూ, తన పట్ల అంతటి అభిమానాన్ని చూపినందుకూ వారందరికీ కృతజ్ఞతలు తెలియ జేసుకుంటూ ఎంతో హర్షణీయంగా మాట్లాడింది.

నిజంగా ఆ సన్మానం నాకే జరిగినట్టుగా ఫీలయ్యాను. బజారు పిల్లకు భాగ్యరేఖ.

నాగరత్నం- మంజరి...

రోడ్డుమీద నాట్యగత్తె- ఎంతో మంది అభిమాన నటి. గదిలో ఉక్కగా ఉన్నట్లనిపించి పక్క బట్టలు తీసుకుని మేడమీదకు వెళ్ళాను.

పదకొండు గంటలయింది. మంజరి రాలేదు. ఆమె రాక గురించి ఎదురుచూస్తూ సిగరెట్టు ముట్టించాను.

ఆ సిగరెట్టు సగం కాలిన తర్వాత రోడ్డు మీద కారాగిన చప్పుడు వినిపించింది. నిలబడి చూశాను. గేటు నెట్టుకొని వస్తోంది మంజరి.

"పైకి రా"

వచ్చి కూర్చున్నాను.

వచ్చింది. నా ఎదురుగా పరుపు మీద కూర్చుంది.

"అప్పుడే వెళ్ళిపోయారేం?"

"ఇంకా ఎందుకు ఐపోయిన తర్వాత.

"మిమ్మల్ని వాళ్ళకు పరిచయం చేద్దామనుకున్నాను"

మాట్లాడలేదు. ఆకాశం కేసి చూశాను.

వెన్నెల విరగ కాస్తోంది. చుట్టూ ఉన్న ఇళ్ళూ, చెట్లూ వెన్నెల కాంతిలో స్నానం చేస్తున్నట్టున్నాయి. హాయిగా ఉంది.

సిగరెట్టు పొగ మందంగా కనిపిస్తోంది.

"ఇప్పుడు నిన్ను 'నువ్వు' అని పిలవాలంటే అదోలా అనిపిస్తోంది. నువ్వు అంతగా ఎదిగిపోయావు" సిగరెట్టు పీకను నలిపి దూరంగా పారేస్తూ అన్నాను.

మంజరి కొంచెం ముందుకు జరిగింది. తర్వాత అన్నది: "భలేవారే. లోకం దృష్టిలో నేను సినీ నటి మంజరినే కావచ్చు. కాని మీ దృష్టిలో మాత్రం నాటి నాగరత్నాన్నే. దయచేసి అలా ఫీలు కావద్దు..."

నవ్వాను.

తర్వాత ఒక గంటసేపు సినిమా షూటింగుల గురించీ, రీటేక్‌ల గురించీ, అభిమానుల ఉత్తరాల గురించీ మాట్లాడింది.

వింటూనే నేను నడుం వాల్చాను. క్రమంగా నిద్ర వస్తోంది. ఆ సమయంలోనే మాట్లాడుతున్న మంజరి చెయ్యి నా గుండెల మీద పడింది.

కళ్ళు తెరిచాను. నా మీదకు ఒరుగుతోంది.

"ఏమిటిది?" అన్నాను. లేచి కూర్చుంటూ. నిజానికి ఆమె అలా ప్రవర్తిస్తుందనుకోలేదు.

"భలేవారే! మగవాడిలా మీరు అడగవలసిన ప్రశ్నేనా ఇది?" నవ్వింది.

ఆమె ఈజీగానే అర్థమయిపోయింది.

"ఆవేశపడకు- నాకు అలాంటి ఉద్దేశం లేదు" అన్నాను.

"నమ్మను మాస్టారూ... నేను మీ కంటికి అందంగా కనిపించటం లేదా?"

"నువ్వు ఇంకా అందంగా ఉన్నా నాకు నీ మీద ఎలాంటి కోరికా ఉండదు"

మళ్ళీ నవ్వింది.

"భయపడకండి మాష్టారూ! నే నేమీ అనుకోను. మీ వల్ల నేనేదో శీలాన్ని పోగొట్టుకుంటానని అనుకోకండి. ఈ స్థితికి రావటానికి ఇప్పటికి ఎంతో పోగొట్టుకున్నాను. ఇంకా పోగొట్టుకోవాలి. అందువల్ల మీలో అలాంటి ఆలోచన ఉంటే తరిమెయ్యండి. అసలు ఈ రాత్రే నాకు వేరే ఎంగేజుమెంట్ ఉంది. నేను మిమ్మల్ని కలవాలని వచ్చేశాను. ఎందుకు? ప్లీజు! కాదనకండి. నాకు ఈ తృప్తిని మిగల్చండి. మిగిలిన వాళ్ళందరికీ గత్యంతరం లేక అర్పించుకున్నా. మీకు మాత్రం నన్ను నేను సంతోషంగా అర్పించుకుంటాను మాస్టారూ."

తల తిరిగిపోయింది.

రుణాన్ని, కృతజ్ఞతను తీర్చుకునే దారి ఇదా? ఇప్పటివరకు కేవలం ఆమె మనిషే మారిందనీ, మనసు మారలేదనీ అనుకున్నాను. కాని ఇప్పుడర్థమయ్యింది. మనసు కూడా బాగానే మారిపోయిందని.

"క్షమించు నాగరత్నం! నువ్వు ఈనాడు సినీ నటివే కావచ్చు. నీకు ఎంతోమంది అభిమానులు ఉండవచ్చు. నువ్వు ఎంత గొప్పదాని వయినా, ఎంత ఉన్నత స్థితికి చేరుకున్నా నిన్ను నేను మనసారా అభినందించగలను గానీ నా మనసులో ఉన్న ఒక నాటి నీ రూపాన్ని చెరుపుకోలేను. ఇప్పుడు నువ్వు ఎంతో అందంగా కనిపించవచ్చు. మంచి స్టేటస్‌లో ఉండవచ్చు. కానీ నా హృదయంలో మాత్రం అప్పటి నీరూపం పధ్నాలుగేళ్ళ వయసుతో లంగా, జాకెట్టు వేసుకుని నాతో నాతో మాట్లాడినప్పటి రూపమే ఉన్నది. ఆ రోజుల్లో కూడా నా  కిలాంటి ఆలోచన లేదు. ఇప్పుడూ లేదు. ఇలాంటి కోరిక మళ్ళీ కోరకు. నన్ను ఎప్పుడూ గుర్తుంచుకో. అదేనా నువ్వు నా పట్ల చూపదలుచుకున్న కృతజ్ఞత. ఇవిగో... గది తాళం చేతులు. వెళ్ళి ఫాను పెట్టుకుని లోపల పడుకో" అని దిండు కింద నించి కీస్ మంజరికి అందించాను. వాటిని అందుకుంటున్నప్పుడు ఆమె కళ్ళ నుండి రెండు నీటి బొట్లు నా చేతిమీద పడ్డాయి.

తలెత్తేసరికే ఆమె గబగబా వెళ్ళిపోయింది. ఆ కన్నీటి బొట్ల కేసి చూస్తే అందులో వెన్నెల వెలుగు కనిపించింది.

(28-11-1979 ఆంధ్రప్రభ వారపత్రికలో ప్రచురితం)